

కౌటాల : పార్టీలో చేరిన వారితో కలిసి నినాదాలు చేస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప

# మళ్లీ బీఆర్ఎస్‌దే విజయం

● సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, అక్టోబర్ 21 : వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌దే విజయమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని తన నివాసంలో డబ్బా, కన్నెపల్లి, బారెగూడ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు శనివారం బీఆర్ఎస్‌లో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మాయ మాటల, పగటి వేషగాళ్ల ఆటలు ఇక్కడ సాగవన్నారు. ఎప్పటికీ స్థానికంగా ఉండేది, ప్రజలకు సేవ చేసేది తానేనని, ప్రజలు సేవకులనే కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తనను ఆదరించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

చింతలమానేపల్లి, అక్టోబర్ 21 : మండలంలోని లంబడీహెట్టి, రుద్రాపూర్, హేటిగూడ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకయ్య, కోఆప్షన్ సభ్యుడు నాజీమ్ హుస్సేన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతం



బీఆర్ఎస్‌లో చేరిన కాసిపేట మండల యువకులతో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

● బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబర్ 21 : బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందని బెలంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. కన్నెపల్లి మండలంలోని పోలంపల్లి, శికినం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిష్టాగౌడ్, గాదె సత్తన్న, పనస సత్తన్న, పనస మహేశ్‌తో పాటు 100 మంది నాయకులు, కార్యకర్తలు తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు పుప్పాల మహేశ్, కాసిపేట మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం రాత్రి వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమం గురించి ఆలోచించేది సీఎం కేసీఆర్ ఒక్కరేనని అన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ఇంటింటా వివరించాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ నిరంజన్ గుప్తా, తాండూర్, కన్నెపల్లి, కాసిపేట మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

● కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



కొబ్బరికాయ కొడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ ,ఆయన సతీమణి రేవతి,కూతురు ముక్త

ఆసిఫాబాద్,అక్టోబర్ 21: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కలెక్టర్ బోర్కడ హేమంత్ అన్నారు. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ హేమంత్, ఆయన సతీమణి రేవతి, కూతురు ముక్తతో కలిసి పాల్గొన్నారు. బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మహిళలు ఆడిపాడారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సావిత్రి , గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, వివిధ శాఖల అధికారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోసపూరిత మాటలు నమ్మవద్దు

● ఇంటింటా ప్రచారంలో ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు



ఆయా కూడళ్ల వద్ద ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి, అక్టోబర్ 21: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని బీఆర్ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని మొర్రిగూడ, కొత్తగూడ, లింగిగూడ, కన్నెపల్లి, రాంబాయిగూడ, బోడగుట్ట, సమ్మక్క కాలనీ, మొలలగూడ, బోరింగ్‌గూడ, గోయగాం గ్రామాల్లో శనివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల్లోని గిరిజనులు సంస్కృతి సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు రూ 150 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. జనవరిలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మాండ్ల జగదీశ్, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రాజయ్య, శంకరయ్య, రమేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే అసత్య ప్రచారం

● మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 21: కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు ఓటమి భయం పట్టుకుందని, ఆయన మానసిక పరిస్థితి సరిగా లేనట్టుగా కనిపిస్తున్నదని, అందుకే ఇష్టం వచ్చినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నాడని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గానికి చెందిన నాయకులతో కలిసి మాట్లాడారు. తనపై , తన కుమారులు, పార్టీ నాయకులపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. తనకు శామీర్‌పేట, అంతర్గాం, తాండూర్ సమీపంలో భూములు ఉన్నాయని వ్యాఖ్యానించారని, వాటి రికార్డులు చూపించాలని డిమాండ్ చేశారు. తన పెద్ద కుమారుడు, కోడలు 20 ఏళ్లుగా లండన్‌లోనే ఉంటూ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ సంపాదిస్తున్నారని తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే చేసిన ఆరోపణలన్నింటినీ నిరూపించాలని సవాల్ విసిరారు. నీవు సంపాదించిన సొమ్మంతా అక్రమమేనని, చిరాన్‌పోర్టు క్లబ్ నీకు ఎలా వచ్చిందో అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని, పత్తాలాట, భూకబ్జాలు, సెటిల్‌మెంట్లతో సంపాదించిన పాపపు సొమ్మును ప్రజలకు పంచుతూ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నావని, నీకు ఓటు వేస్తే ఏం జరుగుతుందో ప్రజలు ఊహిస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో లేఅవుట్ భూములను కబ్జాచేసి దాదాపు 600 కుటుంబాల్లో సంతోషం లేకుండా చేశావని, అలాగే చాలామంది దగ్గర అప్పులు చేసి ఇవ్వడం లేదని, నీవు ఉంటున్న ఇల్లుకు కూడా భూమి డబ్బులు ఇవ్వలేదని, బ్యాంకులకు కోట్లాది రూపాయలు అప్పుగా ఉన్నావని, నాయికినిపేట, మెట్‌పల్లి రైతులకు వచ్చిన భూమి పరిహారాన్ని మింగావని, లక్షెటిపేటలో గురకుల బిల్డింగ్ స్లాబు వేయకుండానే బిల్లు ఇవ్వాలని అధికారిని బెదిరింపులకు గురిచేశావని, ఇవ్వకుంటే అతనిని బదిలీ చేయించావని ఆరోపించారు. ఆరేళ్లు ఎమ్మెల్సీగా ఉన్నావని, నీవు చేసిన ఒక్క పనిని మచ్చుకైనా చెప్పాలని డిమాండ్ చేశారు. టిక్కెట్లు ఇప్పిస్తానని చెప్పి ఉమ్మడిజిల్లాలో పలువురు దగ్గర డబ్బులు వసూలు చేశావని, వారంతా ఇప్పుడు డబ్బులు ఇవ్వాలని అడుగుతుండటంతో దిక్కుతోచని స్థితిలో మానసికంగా ఇబ్బంది పడుతూ దిగజారు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, బీఆర్ఎస్ యూత్ నాయకులు విజిత్‌రావు, పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, వర్కింగ్ ప్రసిడెంట్ హరికృష్ణ, నాయకులు పల్లపు తిరుపతి, గోగుల రవీందర్‌రెడ్డి, రాకేశ్, గరిగంటి సరోజ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

గర్మిళ్ల, అక్టోబరు 21: పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 189 మంది తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసులను స్మరిస్తూ నివాళులర్పిస్తున్నామన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు ఆమె గౌరవవందనం తీసుకుని, వివిధ సంఘటనల్లో ఉగ్రవాదులు అసాంఘిక శక్తులతో పోరాడి అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

**పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం**

పోలీస్ అమరవీరుల దినోత్సవం (ఫ్లాగ్ డే) సందర్భంగా పోలీస్ కమిషనరేట్ ఆవరణలో అధికారులు, సిబ్బంది కోసం అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్‌ను సీపీ రెమా రాజేశ్వరి ప్రారంభించారు. కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



హాజీపూర్ : నివాళులర్పిస్తున్న కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా

**త్యాగాలు మరువలేనివి**

హాజీపూర్, అక్టోబర్ 21 : పోలీసుల అమరవీరుల త్యాగాలు మరువలేనివని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా అన్నారు. మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్‌లో గల అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం పెట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి – రాజయ్య, నంనూర్ ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, సర్పంచ్ బేర పద్మ – పోచయ్య, ఆర్ఐలు కుమార స్వామి, ఎస్ రవి, శ్యామ్, శ్రీనివాస్, మారుతి, భాస్కర్ యాదవ్, బెటాలియన్ వైద్యులు శ్రీధర్, మినిస్టీరియల్ సిబ్బందితో పాటు బెటాలియన్‌లోని పోలీసులు పాల్గొన్నారు.

**సేవలు చిరస్మరణీయం**

ఆసిఫాబాద్, అక్టోబర్ 21 : పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. ( ఫ్లాగ్ డే) ను పురస్కరించుకొని శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ సురేశ్ కుమార్‌తో కలిసి పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూర్, ఆసిఫాబాద్ ప్రాంతంలో 1995 నుంచి ఇప్పటివరకు 14 మంది పోలీసులు తమ ప్రాణాలను శాంతి భద్రతల కోసం త్యాగం చేశారన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి, బహుమతులు అందించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వర రావు, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్ , రమేశ్, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.